సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 19 । మార్చి । 2023



**మరింత మెరుగైన 'భోజనం'**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. - 8లో



**సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం**

ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తామని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. - 8లో



**ఏనుగుల అలజడి**

భామిని: మండలంలో ఏనుగులు అలజడి రేపుతున్నాయి. పంటలను నాశనం చేస్తూ రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి. మనుమకొండ, కోసలి, కీసర గ్రామాల మధ్య తిష్టవేసిన ఏనుగుల గుంపులు చెరకు, మొక్కజొన్న, కూరగాయలు, పుచ్చకాయల పంటలను ధ్వంసం చేస్తున్నాయి.

## న్యూస్‌రీల్

### గ్లకోమా వ్యాధితో జాగ్రత్త

- జిల్లా కంటి వెలుగుసెల్ నేత్ర వైద్య అధికారి నగేష్‌రెడ్డి



కురుపాం సీహెచ్‌సీలో నేత్రపరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడి

కురుపాం: గ్లకోమా వ్యాధి (నీటికాసులు)పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ గ్లకోమా వ్యాధి వారోత్సవాల ముగింపు సందర్భంగా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర పరీక్షలు చేశారు. వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన ఐటీయుక్త



అతిథులను సత్కరిస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఐటీ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన ఐటీ యుక్త ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. విద్యార్థులు నిర్వహించిన వర్క్‌షాపు, టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఈవెంట్స్ అందరినీ ఆలోచింపజేశాయి. సాయంత్రం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం ముఖ్యఅతిథులుగా హాజరైన జేఎన్‌టీయూ వీసీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ కె.శ్రీకుమార్‌లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి బి.తిరుమలరావు, బిందు మాధురి, జయసుమ, అనిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శతశాతం పౌష్టికాహారం పంపిణీ

పార్వతీపురం: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు శతశాతం పౌష్టికాహారం అందించి రక్తహీనతలో పాన్ని అధిగమించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మహిళా, శిశు సంక్షేమ అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు, బాల్య వివాహాల నిర్మూలనకు చేపడుతున్న చర్యలపై వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ క్షేత్ర స్థాయిలో కొంత మందికి అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయని, కారణాలను విచారించి అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కేతిరెడ్డి విజయ గౌరిని ఆదేశించారు. బాల్యవివాహాలను నిర్మూలించాలని సూచించారు.

### అవలంగిలో లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన లేగదూడలు

పాలకొండ రూరల్: కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా జన్మించిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం మండలంలోని అవలంగి గ్రామంలో శనివారం నిర్వహించారు. దీనికి జిల్లా పశుగణన అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆరోగ్యకరమైన, ఉత్తమ జాతికి చెందిన 20 దూడలను ఎంపికచేసి, వాటిని పోషిస్తున్న రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రభామాణిక్యరావు, వైద్యులు బి.సిద్ధార్థ, పి.నారాయణరావు, పి.పద్మ, ఎం.జగదీష్, జి.రాజశేఖర్ పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన

- కొమరాడలో 350 ఎకరాల జొన్న పంటకు నష్టం
- నేలవాలిన అరటితోటలు
- వీరఘట్టంలో 4.9సెంటీమీటర్ల వర్షం
- కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



వీరఘట్టంలో కురుస్తున్న భారీ వర్షం

కొమరాడ/జియ్యమ్మవలస/సీతంపేట/వీరఘట్టం/సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం వర్షం దంచికొట్టింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. వీరఘట్టంలో 4.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలులతో కూడిన వర్షంతో అరటి, మొక్కజొన్న, మామిడి, జీడిమామిడి, నువ్వు పంటలకు నష్టం వాటిల్లింది.

- కొమరాడ మండలంలో గంగారేగువలసలో 15 ఎకరాలు, గుణానపురంలో 102 ఎకరాలు, దళాయపీటలో 35 ఎకరాలు, కళ్లికోటలో 198 ఎకరాల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్టు కురుపాం వ్యవసాయ సహాయ సంచాలకులు అలజింగి నిర్మల తెలిపారు. నేలకొరిగిన జొన్న పంటను పరిశీలించామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు భావన తదితరులు పాల్గొన్నారు.
- జియ్యమ్మవలస మండలంలోని బాసంగి, వెంకటరాజపురం, బిత్రపాడు గ్రామాల్లో నేలకొరిగిన మొక్కజొన్న పంటనలు ఏఏఓ సోనియా పరిశీలించారు. మొక్కదశలో ఉన్న మొక్కజొన్న చేనుకు నష్టం వాటిల్లిందని ఆమె తెలిపారు.
- సీతంపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి జీడి, మామిడి పిందెలు రాలిపోయాయని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. సీతంపేట, దోనుబాయి, కుశిమి, శంబాం, సోమగండి, హడ్డుబంగి తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.
- వీరఘట్టం మండల వ్యాప్తంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంచెలంచెలుగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. 4.9 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఈదురు గాలుల దాటికి అరటి పంటకు నష్టం వాటిల్లిందంటూ రైతులు వాపోతున్నారు. సాలూరులో మోస్తరు వర్షం కురిసింది.



కొమరాడ: గుణానపురంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీ అలజంగి నిర్మల

### కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పార్వతీపురం: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం అప్రమత్తం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (08963-293046) ఏర్పాటు చేశారు. ఇందులో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాలవల్ల కలిగే నష్టాలు, సహాయక చర్యలకు కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.



జియ్యమ్మవలస: బాసంగిలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఏఏఓ సోనియా



సీతంపేటలో కురుస్తున్న వర్షం

పేద విద్యార్థుల చదువులకు

# 'జగనన్న విద్యాదీవెన'

- నేడు విద్యాదీవెన పథకం నిధుల విడుదల
- జిల్లాలో 19,999 మంది విద్యార్థులకు రూ.11.56 కోట్ల లబ్ధి

జగనన్న విద్యాదీవెన లబ్ధిదారులు ఇలా..

| నియోజక వర్గం | లబ్ధిదారులు | జమ చేయనున్న నిధులు |
|---|---|---|
| కురపాం | 5,322 | రూ.28.77 కోట్లు |
| పాలకొండ | 5,132 | రూ.28.28 కోట్లు |
| పార్వతీపురం | 5,578 | రూ.35.62 కోట్లు |
| సాలూరు | 3,967 | రూ.23.00 కోట్లు |
| మొత్తం | 19,999 | రూ.11.56 కోట్లు |



పార్వతీపురంటౌన్: పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరంకారాదన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించింది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందిస్తోంది. పూర్తిస్థాయి ఫీజురీయింబర్స్‌మెంట్‌ను చెల్లిస్తోంది. ఇందులో భాగంగా మలివిడత జగనన్న విద్యా దీవెన నిధులను సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదివారం విడుదల చేయనున్నారు. జిల్లాలోని 19,999 మంది విద్యార్థులకు రూ.11.56 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరనుంది. విద్యార్థులు కళాశాలలకు కట్టాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో నేడు జమచేయనుంది.

### అర్హులందరినీ ఎంపిక చేశాం



జగనన్న విద్యా దీవెన పథకానికి జిల్లా నుంచి అర్హులందరినీ ఎంపిక చేశాం. పార్వతీపురం మన్యం జిల్లాలో 19,999 మంది విద్యార్థుల తల్లు బ్యాంకు ఖాతాల్లో రూ.11.56 కోట్లను ప్రభుత్వం జమచేయనుంది.

– మహ్మద్ గయాజుద్దీన్, జిల్లా బీసీవెల్ఫేర్ అధికారి, పార్వతీపురం మన్యం

# రోడ్లులేని గ్రామాల గుర్తింపు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో రోడ్లులేని గ్రామాలను గుర్తించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో రహదారుల నిర్మాణంపై కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్ల నిర్మాణానికి ఏ మేరకు అటవీభూమి అవసరమవుతుందన్న ప్రాథమిక సమాచారం సేకరించాలని సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ-జడ్డ, జడ్డ-మంత్రజోల, గొరడ జంక్షన్-బయ్యాడ, ములుగూడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గొరడ జంక్షన్, పాములగీసాడ-కొత్తగూడ, కురుపాం మండలంలో జి.శివడ- మద్దుగూడ, కొమరాడ మండలంలో కొండకూనేరు-పెదశాఖ రోడ్లు నిర్మించాలని కమిటీ నిర్ణయించింది. సమావేశంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఎఫ్ఓ ప్రసూన, జె.శాంతీశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

# మట్టి మనసులు



- అనాథలకు కడుపు నింపుతున్న మట్టిపాత్రల తయారీ పరిశ్రమ
- ఆదర్శంగా హజ్రత్ ఖాదర్ వలీబాబా ఆశ్రమం
- వసతి, పౌష్టికాహారం, వైద్యం, ఉపాధి... అన్నివిధాలా అండ
- పనిచేయాలనే ఆసక్తి ఉన్నవారికి పరిశ్రమలో ఉపాధి
- మట్టిపాత్రలు, మట్టి ఆధారిత కళాకృతుల ఎగుమతి
- ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం
- పరిశ్రమ సొమ్ముతో అనాథాశ్రమం, నిత్యాన్నదానం నిర్వహణ

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అక్కడున్నవారంతా పెద్దవారైన పిల్లలు వదిలించుకున్న తల్లిదండ్రులు! బంధాలు, అనుబంధాలు, ప్రేమలు, అనురాగాలు క్రమేపీ కరువైపోతున్న సమాజంలో ఇలాంటివారికి ఇప్పుడు నీడ కరువవుతోంది. వారు తమ పిల్లలను పెద్దవారిని చేయడానికి చేసిన త్యాగం వృథాఅవుతోంది. జీవిత చరమాంకంలో చేదోడుగా ఉండాల్సిన వారే తమకు తల్లిదండ్రులు భారంగా ఉన్నారంటూ వృద్ధాశ్రమాల్లో చేర్చేస్తున్నారు. అదీ ఇష్టం లేకుంటే గాలికి వదిలేసి తమ దారి చూసుకోమంటున్నారు! జగమంత కుటుంబంలో ఏకాకిగా మిగిలిన వారికి ఓ ఆపన్నహస్తం కనిపిస్తోంది. అదే విజయనగరం బాబామెట్ట ఖాదర్‌నగర్‌లోనున్న ఆస్థానా అతా ఇ తాజ్ ఖదారియా (ఏటీకే) వెలుగు అనాధల వృద్ధాశ్రమం. అదొక ఆశ్రమమే కాదు స్వయం ఆధారిత సమ్మేళనం. మట్టిపాత్రల పరిశ్రమను వారి ఆదాయం కోసమే గాకుండా పర్యావరణ హితానికి తమవంతు ప్రయత్నంగా మలచుకున్న వైనం ఆదర్శంగా నిలుస్తోంది.

**మట్టి పనితో మనసు హాయి...**

తమ పిల్లల నిర్లక్ష్యం, మోసం తట్టుకోలేక ఏటీకే వృద్ధాశ్రమంలో పలువురు తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యేవారు. గతాన్ని మరచిపోయి మళ్లీ సాధారణ పరిస్థితికి రావాలంటే ఏదో ఒక వ్యాపకం ఉంటే బాగుంటుందని బాబామెట్టలోని హజ్రత్ ఖాదర్ వలీ బాబా దర్గా ధర్మకర్త డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్ (ఖలీల్‌బాబు)కు వచ్చిన ఆలోచనకు కార్యరూపమే మట్టిపాత్రల పరిశ్రమ. ఆ మట్టితో మమేకమైన ఆ మనుషుల మనసులు తేలికపడుతున్నాయి. వారి మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతోంది. వారు తయారుచేసిన మట్టిపాత్రలు, మట్టి ఆధారిత వస్తువులు పర్యావరణ హితానికి పరోక్షంగా దోహదపడుతున్నాయి. అలా ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన మట్టిపాత్రల పరిశ్రమ ఇప్పుడు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకే గాకుండా దేశవిదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది.



మట్టిపాత్రలకు తుదిమెరుగులు అద్దుతున్న మహిళలు

**స్థానిక మహిళలకూ ఉపాధి...**

దర్గాకు ఆనుకొనే ఆశ్రమం ఉంది. దాని ఆవరణలోనే మట్టిపాత్రల పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో వంద మంది వరకూ నీడ పొందుతున్నారు. వారిలో పనిచేయాలనే ఆసక్తి, శక్తి ఉన్న 12 మందితో పాటు మరో 40 మంది స్థానిక మహిళలకు మట్టిపాత్రల పరిశ్రమ ఉపాధి కల్పిస్తోంది. మధ్యాహ్నభోజనం అక్కడే ఉచితంగా అందిస్తున్నారు. పరిశ్రమలో సుమారు 56 రకాల మట్టిపాత్రలు, మట్టిఆధారిత వస్తువులు, అలంకరణ సామగ్రి, జపమాలలు తయారుచేస్తున్నారు. ఏటీకే ముద్రతో తయారవుతున్న మట్టిపాత్రలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. జపమాలలను మలేసియా, ఇండోనేషియా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.



వృద్ధునితో మాట్లాడుతున్న ఖలీల్‌బాబు

**ఆ ఆదాయమే ఆధారంగా...**

మట్టిపాత్రల తయారీ పరిశ్రమ ఏటా రూ.50 లక్షల ఆదాయాన్ని అందిస్తోంది. పనివారికి జీతాలు, ముడిసరుకుల ఖర్చులు పోను మిగతా సొమ్ము అంతా ఆశ్రమం నిర్వహణకే వినియోగిస్తున్నారు. మంచి పౌష్టికాహారం అందించడమేగాక వైద్యం చేయిస్తున్నారు.

### మట్టి వస్తువుల తయారీయే ఆధారం



నా పేరు పొట్నూరు సత్యవతి. మట్టి పాత్రల తయారీ పరిశ్రమలో ఆరేళ్లుగా పని చేస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం డిగ్రీ ఒకరు, ఐటీఐ ఒకరు చదువుతున్నారు. కుటుంబం మొత్తం సేవలోనే ఉంటాం. మట్టిపాత్రలు తయారుచేయడంలో మెలకువలు నేర్చుకున్నాను. రోజూ పనిచేయడంతో కొత్త రకాల పాత్రలు తయారుచేయాలనే ఆలోచన వస్తుంటుంది. ఆ దిశగా ఖలీల్‌బాబు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిశ్రమ మాకు ఆధారంగా నిలుస్తోంది.

### దేవుడిలా ఆదుకున్నారు...



విజయనగరం రంగరీజువీధిలోనే ఒకప్పుడు ఉండేవాణ్ని. నా పేరు నరసింగరావు. సినిమా షూటింగ్‌లకు డెకరేషన్, ముత్యాల మండపాల తయారీతో పాటు టైలరింగ్ చేసేవాడిని. వృద్ధాప్యంతో ఇక ఆ పని చేయలేకపోతున్నా. ఆశ్రమానికి వచ్చి మూడేళ్లు అయింది. ఖలీల్‌బాబు దేవుడిలా ఆదుకున్నారు.

### పనిచేసుకుంటూ జీవనం..



నా పేరు తోలేటి ఈశ్వరమ్మ. మాది పలాస. 20 ఏళ్లకిందట విజయనగరం వచ్చాం. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వారికి పెళ్లిళ్లు అయిపోయాయి. నా భర్త చనిపోయిన తర్వాత ఖాదర్ బాబా ఆశ్రమానికి వచ్చేశాను. ఇక్కడే మూడు పూటలా భోజనం, వసతి ఉంటాయి. మట్టి పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను.

## క్లుప్తంగా

### సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



జోనల్ వర్క్ షాప్ వద్ద మాట్లాడుతున్న దామోదరరావు, ప్రసాద్

విజయనగరం టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తామని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పలిశెట్టి దామోదర రావు, అమరావతి రాష్ట్ర కమిటీ ముఖ్య సలహాదారు జిడి.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వీటీ అగ్రహారం జోనల్ వర్క్ షాప్ వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం ముందున్నటువంటి అన్ని సౌకర్యాల సాధన కోసం, మెడికల్ సౌకర్యాలు, ఓటీలు, నైట్ ఓటీ అలవెన్స్‌లు తదితర సమస్యలు ఉన్నాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ఎం.డి ద్వారకా తిరుమలరావు సహకారంతో పరిష్కారమవుతున్నప్పటికీ ప్రభుత్వ స్థాయిలో ఉన్న సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదమజ్జి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పి.భానుమూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిఎస్.రాజు, రవికాంత్, కుమారి, నాయుడు, కెవి.రమణ డిపో గౌరవాధ్యక్షుడు టిఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 420.00 |
| విజయనగరం | రూ. 424.00 |
| శ్రీకాకుళం | రూ. 424.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24క్యా. 10గ్రా.) | 56,150–00 |
| బంగారం(22క్యా. 10గ్రా.) | 51,800–00 |
| వెండి (కిలో) | 71,200–00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹100 | ₹170 | ₹ 180 |

# మరింత మెరుగైన 'భోజనం'

- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- వారంలో మూడుసార్లు రాగిజావ అందించేందుకు చర్యలు
- డీఈఓ లింగేశ్వరరెడ్డి



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. మధ్యాహ్న భోజన పథకంలో మరింత మెరుగైన పౌష్టికాహారం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వారంలో మూడు రోజులు రాగి జావ అందించేందుకు చర్యలు చేపట్టారు. రాగి జావ విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఉప విద్యాశాఖాధికారి తిరుపతినాయుడుతో కలిసి శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో డీఈఓ లింగేశ్వరరెడ్డి ప్రారంభ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పోషకాలతో కూడిన రుచి, శుచికరమైన ఆహారం అందించే లక్ష్యంతో మెనూను తిర్చిదిద్దిందన్నారు. విద్యార్థుల్లో కాల్షియం, ఐరన్ లోపాలు అధికమించేందుకు వారంలో మూడు రోజులు రాగి జావ అందించేందుకు నిర్ణయించిందన్నారు. ఈ నెల 21వ తేదీన రామభద్రపురం ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించనున్నామన్నారు. జిల్లాలోని 1762 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 1.41 లక్షల మంది విద్యార్థులు వినియోగించుకోనున్నారని తెలిపారు.

**పదో తరగతి పరీక్ష కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు**

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నందున పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 127 పరీక్ష కేంద్రాలలో 25 వేల మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి ఈ మండలంలోని కొట్టక్కి విద్యార్థులు సాలూరు వెళ్లకుండా రామభద్రపురం పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోనే రాసేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఎంఈఓ తిరుమలప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగభూషణరావు పాల్గొన్నారు.

## విజయభావన వార్షికోత్సవానికి సర్వం సిద్ధం



వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

- భవానీదేవీకి విజయభావన పురస్కారం
- రోహిణికి ఆచార్య భావన్ పురస్కారం

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య 38వ వార్షికోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు పేర్కొన్నారు. స్థానిక గురజాడ స్వగృహంలో శనివారం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న శోభకృత్ ఉగాదిన నిర్వహించే విజయభావన వార్షికోత్సవంలో ప్రముఖ సాహితీవేత్త హైదరాబాద్‌కి చెందిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ప్రత్యేక విధి నిర్వహణాధికారి డాక్టర్ చిల్లర భవానీదేవికి విజయభావన పురస్కారం అందజేస్తున్నామన్నారు. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కథానిక పోటీల్లో విజేతగా నిలిచిన హైదరాబాద్‌కి చెందిన వి.రోహిణికి ఆచార్యభావన్ స్మారక పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం హస్తకళా ప్రదర్శన, కవి సమ్మేళనం, సాయంత్రం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా భవానీదేవికి పురస్కార ప్రదానం ఉంటాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, ఇబ్రహీంఖాన్‌ల సంధ్యా నర్తనం నృత్యరూపకం ప్రదర్శిస్తారన్నారు. సాహితీవేత్తలు, అభిమానులందరూ పాల్గొని తరించాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు దేవరాజు గోపాలకృష్ణ, కార్యదర్శులు డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఐసీటీసీలకు ఇంటర్నెట్ సౌకర్యం

- స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ కామేశ్వరప్రసాద్



భద్రగిరి సీహెచ్‌సీలో సేవలపై ఆరా తీస్తున్న జేడీ కామేశ్వర ప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: ఎయిడ్స్‌ను నిర్ధారించే ఐసీటీసీ కేంద్రాలన్నింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది పనితీరు తదితర సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 2.13 లక్షల మంది ఎయిడ్స్ బాధితులుండగా ఈ ఏడాదిలోనే 14వేల మందికి ఎయిడ్స్ పాజిటివ్ వచ్చిందన్నారు. కావున ఎయిడ్స్ పట్ల నిర్లక్ష్యం వీడి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో నిర్వహించే ఎయిడ్స్ టెస్ట్ వల్ల పాజిటివ్ వస్తే తప్పనిసరిగా ఐసీటీసీల్లో మరో రెండు టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు టెస్టులు చేసుకున్నాకే ఎయిడ్స్ నిర్ధారణ అవుతుందన్నారు. గర్భం దాల్చాక తప్పనిసరిగా హెచ్‌ఐవీ పరీక్ష చేయాల్సి ఉన్న క్రమంలో ప్రాథమిక టెస్టులతో పాటు మిగతా రెండు టెస్టులు కూడా ఆస్పత్రుల వద్దే నిర్వహించుకునేందుకు టెక్నీషియన్లు ఆసక్తి చూపితే సంబంధిత పరికరాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 213 ఐసీటీసీలుండగా వాటన్నింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర బయో మెడికల్ కన్సల్టెంట్ రమేష్ ఉన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం



రాంబాబు(ఫైల్)

పాలకొండ రూరల్: పాలకొండ – లుంబూరు రహదారిలో కిష్టప్ప చెరువు సమీపంలో శనివారం సాయంత్రం ట్రాక్టర్ ఢీకొని నగర పంచాయతీలోని పెద్దగొల్లవీధికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పేకేటి రాంబాబు(22) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కిష్టప్ప చెరువు సమీపంలో ఉన్న కాలనీలో రాంబాబు కుటుంబీకులకు కేటాయించిన ఇంటి స్థలంలో నిర్మాణం జరుగుతుంది. పనుల వద్ద నీటిని అందించి తిరిగి బైక్‌పై రాంబాబు ఇంటికి వస్తున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొంది. దీంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోనే మృతుని ఇల్లు ఉండడం అందరికీ విషయం వెంటనే తెలియడంతో కుటుంబ సభ్యులంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి తవిటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.శివప్రసాద్ కేసు నమోదు చేశారు.

**కన్నీరుమున్నీరు...**

రాంబాబు తల్లి చిన్నతనంలోనే చనిపోయింది. తండ్రే అన్నీ తానై పెంచాడు. ఇప్పుడు చేతికందొచ్చిన కొడుకు అందనంత దూరాలకు వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నాడు. తండ్రి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

# నిజాయితీ చాటుకున్న మహిళా పోలీసులు

- దొరికిన రూ.లక్షన్నర బాధితునికి అందజేత



ఎస్‌ఐ సమక్షంలో బాధితునికి నగదు అందిస్తున్న సచివాయ మహిళా పోలీసులు

పాలకొండ రూరల్: రోడ్డుపైన ఓ రూపాయి కనిపిస్తే చాలు తీసి జేబులో వేసుకుని వెళ్లిపోయే రోజులివి. అలాంటిది రూ.లక్ష 50 వేలు కనిపిస్తే ఇంకేముంది పండగే అనుకుంటారు. అలాంటి తమకు దొరికిన మొత్తాన్ని నిజాయితీగా పోలీస్‌స్టేషన్ ద్వారా బాధితులకు అందించారు సచివాలయ మహిళా పోలీసులు. పాలకొండ మండలంలోని తుమరాడ, అర్దలి, లుంబూరు, డోలమడ సచివాలయాలకు చెందిన మహిళా పోలీసులు కిమిడి సూర్యకిరణమ్మ, ఆర్.ప్రశాంతి, సరోజిని దేవి, శ్వేత తదితరులు వారపు నివేదికను పోలీస్‌స్టేషన్‌కు అందించేందుకు శనివారం వచ్చారు. ఈ క్రమంలో జిరాక్స్‌లు తీసేందుకు అక్కడికి సమీపంలో ఉన్న సెంటర్‌కు వద్దకు వెళ్లారు. అక్కడ వీరు కవర్‌లో ఉన్న నగదు గుర్తించారు. ఈ సొమ్ము ఎవరిది అని అక్కడి వారిని అడిగి, ఎవరిది కాదని తెలిసి ఆ నగదును స్థానిక పోలీస్‌స్టేషన్ తీసుకువెళ్లారు. ఎస్‌ఐ బి.శివప్రసాద్ సమక్షంలో సొమ్ము లెక్కించారు. రూ.లక్షా 50వేలు ఉన్నట్లు గుర్తించారు. ఇంతలో వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామానికి చెందిన దాసు శశిభూషణరావు తాను బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు తీసుకువచ్చిన నదగు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేశారు. బాధితుడు అతనేనని నిర్ధారించుకున్న పోలీసులు ఆ సొమ్మును అప్పగించారు. నిజాయితీ చాటుకున్న సచివాలయ మహిళా పోలీసులను సీఐ కె.మురళీధర్, ఎస్‌ఐ తదితరులు అభినందించారు.





## వ్యక్తి ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న అప్పలనాయుడు

పార్వతీపురం: మక్కువ మండలం డి.శిర్లాం గ్రామానికి చెందిన కె.అప్పలనాయుడు అనారోగ్యంతో పాటు మందుకు బానిస కావడంతో పురుగుల మందు తాగి శనివారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మక్కువ మండలం డి.శిర్లాం గ్రామానికి చెందిన కె.అప్పలనాయుడు తన భార్య మందు తాగడానికి డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఎఫ్‌సీఐ గొడౌన్ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారని ఎస్‌ఐ వీబీ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. గుర్ల మండలం గొలగాం గ్రామానికి చెందిన నడిమివలస సావిత్రి, ఆమె తల్లి పత్తిగిల్లి నారాయణ ఈ నెల 17న రేగిడి మండలం కాగితాపల్లిలో ఓ వివాహానికి హాజరయ్యారు. అక్కడ నుంచి రాజాం మున్సిపాల్టీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో బంధువుల ఇంటికి వచ్చారు. శనివారం తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు రాజాం వైపు వస్తున్న ఆటోలో వస్తుండగా ఎఫ్‌సీఐ గొడౌన్ సమీపంలో రోడ్డుపై గొయ్యిలో దిగిన ఆటో బోల్తా పడడంతో వీరిరువురితో పాటు కృష్ణకుమారి అనే మరో వ్యక్తి కూడా గాయాల పాలైంది. వెంటనే స్థానికులు వీరిని ఆటోలో నుంచి బయటకు తీసి రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తవలస : మండలంలోని మంగళపాలెం రైల్వేగేటు సమీపంలో రైలు ట్రాక్ దాటుతుండగా విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్స్ ట్రైన్ ఢీకొని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం దువ్వపాలెం గ్రామానికి చెందిన చిట్టిబోని రాము (64) శనివారం మృతి చెందాడు. మృతుడు రాము మంగళపాలెంలో తనకు తెలిసిన వారి ఇంటికి వచ్చి గేదెలకు కట్టే కన్నెలను కొనుగోలు చేసి ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. విశాఖపట్నం, కొత్తవలస రైల్వే ఎస్‌ఐలు శ్రీనివాస్‌రావు, వికాస్‌నాయక్ ప్రమాద స్థలం పరిశీలించి శవపంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### పూరిల్లు దగ్ధం

సీతంపేట: మండలంలోని పెద్దూరు పంచాయతీ పరిధిలోని చింతమానుగూడ గ్రామంలో శనివారం వేకువజామున సవర బాపయ్యకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. దీంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. ముఖ్యంగా విక్రయానికి సేకరించి ఉంచిన కొండచీపుర్లు, ఒక మేక, 11 నాటు కోళ్లతో పాటు ఇతర వస్తువులన్నీ కాలిపోవడంతో గిరిజనుడి కుటుంబం లబోదిబోమంటుంది. దాదాపు లక్ష రూపాయిల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా. ప్రమాదం తెలుసుకున్న సర్పంచ్ హిమరక ఆదిలక్ష్మి గ్రామాన్ని సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి ప్రమాద విషయం తీసుకువెళ్లినట్టు, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారని బాధితునికి సర్పంచ్ తెలియజేశారు. సచివాలయ సిబ్బంది పరిశీలించారు.

### పట్టుబడిన పీడీఎస్ బియ్యం

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో ఇంకురు శ్రీనివాసరావు అనే వ్యాపారి గిడ్డంగి, ఇంట్లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచినట్టు విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంతో శనివారం దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి సురేష్ బాబు ఆదేశాలతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు మాటు వేసి అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 5.32 లక్షల విలువైన 14 టన్నుల బియ్యాన్ని శ్రీనివాసరావు రేషన్ లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. స్వాధీన పర్చుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించి నిందితునిపై 6 ఏ కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది ఈశ్వరరావు, రామమోహన్, సీఎస్ డీటీ భాస్కరరావు, వీఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.